నరేంద్రపురంలో గ్రావెల్ దోపిడీ

- అర్ధరాత్రి తవ్వకాలు, ట్రాక్టర్లతో తరలింపు
- దర్జాగా అమ్ముకుంటున్న వైసీపీ నాయకులు

. 5లో



ఘనంగా హోలీ వేడుకలు

ఉమ్మడి విశాఖ జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. పట్టణాలు, గ్రామాలు అన్న తేడా లేకుండా యువత, చిన్నారులు పరస్పరం రంగులు చల్లుకుంటూ సందడి చేశారు.



విశాఖలోని ఒక హోటల్‌లో యువత రెయిన్ డ్యాన్స్



ఎలమంచిలిలో బాలికల సంబరాలు

వైసీపీ ఎంపీ అభ్యర్థిపై వీడని ఉత్కంఠ

ఎంపికపై పార్టీ పెద్దలు తర్జన భర్జన

- నిన్నటి వరకు బీజేపీ అభ్యర్థి ఎవరన్నదానిపై నిరీక్షణ
- సీఎం రమేశ్ అభ్యర్థిత్వం ఖరారైనప్పటికీ వైసీపీలో స్పష్టతరాని వైనం
- తెరపైకి బూడి ముత్యాలనాయుడు పేరు
- పార్లమెంట్‌కు పోటీ చేయనంటున్న డిప్యూటీ సీఎం

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

అనకాపల్లి లోక్‌సభ స్థానం నుంచి వచ్చే ఎన్నికల్లో వైసీపీ తరఫున ఎవరు పోటీ చేస్తారన్న దానిపై ఆ పార్టీ శ్రేణులతోపాటు మిగిలిన రాజకీయ పార్టీల్లో కూడా ఉత్కంఠ కొనసాగుతున్నది. రాష్ట్రంలో 25 లోక్‌సభ స్థానాలకుగాను 24 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన వైసీపీ అధిష్ఠానం అనకాపల్లికి అభ్యర్థి పేరును వెల్లడించకుండా 'బీసీ'కి అని మాత్రమే ప్రకటించి సస్పెన్స్‌లో పెట్టిన సంగతి తెలిసిందే. అన్ని ఎంపీ స్థానాలు కైవసం చేసుకుంటామని గొప్పలు చెప్పుకుంటున్న వైసీపీ పెద్దలకు.. అనకాపల్లి ఎంపీగా పోటీ చేయడానికి అభ్యర్థిని వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదిలాఉండగా కూటమి అభ్యర్థిగా బీజేపీ అధిష్ఠానం రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్ పేరును ఆదివారం ఖరారు చేసిన విషయ తెలిసిందే. దీంతో వైసీపీ అభ్యర్థి విషయంలో ఆ పార్టీకి ఒక స్పష్టత వస్తుందని భావించారు. అధిష్ఠానం మాత్రం అనకాపల్లి ఎంపీ అభ్యర్థిని ఎంపిక చేయలేదు. గత ఎన్నికల్లో డాక్టర్ బీవీ సత్యవతి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఎంపీగా గెలుపొందిన విషయం తెలిసిందే. ఆమెకు మరోసారి అవకాశం ఇచ్చేందుకు వైసీపీ అధిష్ఠానం అంత సముఖంగా లేదని తెలిసింది. వైసీపీ పాలనపై తీవ్రవ్యతిరేకత ఉన్న నేపథ్యంలో పార్లమెంటరీ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలను ప్రభావితం చేసే అభ్యర్థి



డాక్టర్ బీవీ సత్యవతి



బూడి ముత్యాలనాయుడు



పిల్లా రమాకుమారి

కోసం వైసీపీ అధిష్ఠానం అన్వేషిస్తున్నట్టు జిల్లా నేతలు చెబుతున్నారు. ఇందులో భాగంగా ఇటు సామాజికంగా, అటు ఆర్థికంగా బలమైన ఎలమంచిలి మునిసిపల్ చైర్‌పర్సన్ పి.రమాకుమారి పేరును తెరపైకి తెచ్చారు. ఆమె పేరు ఖరారు చేస్తారని అంతా భావించారు. అయితే పొత్తులో భాగంగా అనకాపల్లి నుంచి బీజేపీ పోటీ చేస్తుందని కూటమి పార్టీలు ప్రకటించడంతో వైసీపీ అధిష్ఠానం ఇక్కడ ఒక్కచోట మాత్రమే అభ్యర్థిని ప్రకటించలేదు. తాజాగా బీజేపీ విడుదల చేసిన జాబితాలో సీఎం రమేశ్ పేరును ఖరారు చేశారు. దీంతో అదే సామాజికవర్గానికి చెందిన వ్యక్తిని ఎంపీగా బరిలోకి దింపే ఆలోచనలో వైసీపీ పెద్దలు వున్నట్టు సమాచారం. వైసీపీ సీనియర్ నేత, ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడుని ఎంపీగా పోటీ చేయించాలని భావించి, ఆయనతో చర్చలు జరుపుతున్నట్టు భోగట్టా. మంత్రి కుమార్తె, కె.కోటపాడు జడ్పీటీసీ సభ్యురాలు ఈర్లె అనురాధను మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయించాలని భావిస్తున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.అయితే ఎంపీగా పోటీ చేసేందుకు ముత్యాలనాయుడు ఆసక్తి చూపడం లేదని తెలిసింది. ఎంపీ అభ్యర్థి కోసం వైసీపీ పెద్దలు ఇతర పార్టీల అసంతృప్తి నేతలతో మంతనాలు జరుపుతున్నట్టు సమాచారం. కానీ ఎవరూ ముందుకు రావడం లేదని తెలిసింది.

వైసీపీ నేత భూకబ్జా

ఇరువాడలో దివ్యాంగుడి డి.పట్టా భూమి ఆక్రమణ

- దౌర్జన్యంగా ఎక్స్‌కవేటర్‌తో జీడిమామిడి, నీలగిరి తోటలు ధ్వంసం
- రెవెన్యూ, పోలీసు అధికారులకు బాధితుడి ఫిర్యాదు
- అధికార పార్టీ నేతకే వత్తాసు పలుకుతున్నారని ఆరోపణ

సబ్బవరం, మార్చి 25:

మండలంలోని ఇరువాడలో తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న డి.పట్టా ప్రభుత్వ భూమిని వైసీపీ నాయకుడు, సర్పంచ్ భర్త అయిన బలిరెడ్డి కనకరాజు అన్యాయంగా ఆక్రమించుకుంటున్నారని దివ్యాంగుడైన సియాద్రి రమణబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాధితుడు, అతని కుటుంబ సభ్యులు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఇరువాడ సర్వే నంబరు 139/1డిలో కొంతప్రభుత్వ భూమిని తాత, తండ్రుల నుంచి సాగు చేసుకుంటున్నామన్నారు. 1989లో ప్రభుత్వం తన తండ్రి సియాద్రి ముత్యాలు పేరుతో ఇదే సర్వే నంబరులో 1.21 ఎకరాలకు డి.పట్టా ఇచ్చిందన్నారు. ఈ భూమిలో జీడిమామిడి, నీలగిరి తోటలు సాగు చేసుకుంటూ జీవిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో శనివారం పంచాయతీ సర్పంచ్ బలిరెడ్డి లక్ష్మి భర్త, వైసీపీ నాయకుడు బలిరెడ్డి కనకరాజు ఎక్స్‌కవేటర్‌తో తమ భూమిలోకి అక్రమంగా ప్రవేశించి జీడిమామిడి, నీలగిరి చెట్లు తొలగించారని వాపోయారు. అడ్డుకున్న తమపై దౌర్జన్యం చేశారని ఆరోపించారు. వైసీపీ నేత భూ ఆక్రమణపై రెవెన్యూ అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేశామని, కానీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకుండా ఆక్రమణదారునికే వంతపాడుతున్నారని ఆరోపించారు. తాను ఎనిమిదేళ్ల క్రితం పక్షవాతానికి గురికావడంతో కాళ్లు, చేతులు చచ్చుబడిపోయాయని, తన తండ్రి ముత్యాలు కొంత కాలం క్రితం మృతిచెందాడని, ప్రస్తుతం తనకు ఈ భూమి ఒక్కటే ఆధారమని రమణబాబు వాపోయారు. దివ్యాంగుడిని కావడంతో తాను ఏమీ చేయలేనన్న ధీమాతోనే వైసీపీ నాయకుడు తన భూమిని ఆక్రమించుకోవడానికి తెగబడ్డారని ఆయన ఆరోపించారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని, అక్కడ పట్టించుకోకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని చెప్పారు.



దివ్యాంగుడు రమణబాబు తండ్రి పేరుతో వున్న డి.పట్టా భూమిలో జీడిమామిడి, నీలగిరి చెట్లను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్



ప్రభుత్వం ఇచ్చిన భూమి వద్ద దివ్యాంగుడు సియాద్రి రమణబాబు, కుటుంబ సభ్యులు



వైసీపీ నేత ఆక్రమించిన డి.పట్టా భూమి ఇదే

ఫార్మా వ్యర్థాలకు నిప్పు

- ఎగిసిపడిన అగ్నికీలలు, దట్టంగా కమ్ముకున్న పొగ
- తీవ్ర దుర్వాసనతో ఇబ్బంది పడిన స్థానికులు



ఫార్మా రసాయన వ్యర్థాలకు నిప్పు పెట్టడంతో ఎగిసిపడుతున్న మంటలు, పొగ

పరవాడ, మార్చి 25 : తహసీల్దార్ కార్యాలయానికి సమీపంలోగల కొండ ప్రాంతంలో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పరిసరాల్లో సోమవారం గుర్తు తెలియని వ్యక్తులు ఫార్మా రసాయనాలను విడిచిపెట్టి అనంతరం నిప్పు పెట్టి పారిపోయారు. దీంతో దట్టమైన పొగతో పాటు పెద్ద ఎత్తున మంటలు లేచాయి. ఫార్మా వ్యర్థాలు కావడంతో విపరీతమైన దుర్వాసన వెలువడింది. ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు ఇబ్బంది పడ్డారు. విషయం తెలుసుకున్న రాంకీ అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి వచ్చి మంటలను అదుపు చేశారు. కాగా ఫార్మాసిటీ నుంచి వ్యర్థ రసాయనాలను దొంగచాటుగా బహిరంగ ప్రదేశాల్లో పారబోయడం, నిప్పు పెట్టడం కొంతకాలం నుంచి జరుగుతోందని, ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు చేపట్టాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. రాంకీ యాజమాన్యం నిర్వహిస్తున్న చెక్‌పోస్టులు సక్రమంగా పనిచేయడం లేదనడానికి ఈ సంఘటనే ఒక ఉదాహరణ అని పేర్కొన్నారు. ఈ సంఘటనపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఆయన చెప్పారు.

ఉపమాక వెంకన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు



వెంకన్న దర్శనానికి వచ్చి భక్తులతో రద్దీగా ఉన్న ఆలయ ప్రాంగణం



భక్తులకు దర్శనమిస్తున్న శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి

నక్కపల్లి మండలం ఉపమాక క్షేత్రానికి సోమవారం భక్తులు పోటెత్తారు. కల్యాణోత్సవాలపాటు పౌర్ణమి కావడంతో స్వామివారిని దర్శించుకోవడానికి చుట్టుపక్కల గ్రామాలతోపాటు దూరం ప్రాంతాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. క్యూలైన్లు నిండిపోవడంతో స్వామి దర్శనానికి ఎక్కువ సమయం పట్టింది. కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం రాజయ్యపేట సముద్రతీరంలో స్వామివారికి చక్రస్నానం నిర్వహించారు.

- వార్త 5వ పేజీలో

విమ్స్ అప్‌గ్రేడ్ ప్రతిపాదన అటకెక్కినట్టే!?

రూ.250 కోట్లతో ఆరు బ్లాకులు నిర్మిస్తామని రెండేళ్ల క్రితం ప్రకటించిన ప్రభుత్వం



- ఏడాది క్రితం టెండర్ల ప్రక్రియ పూర్తి
- ఇప్పటికీ మొదలుకాని పనులు
- పూర్తిస్థాయి వైద్య నిపుణులను నియమిస్తామన్న హామీ కూడా నెరవేరని వైనం
- బెడ్స్ పెంపుపైనా అదేతీరు
- కార్యరూపం దాల్చని పీజీ మెడికల్ కాలేజీ ఏర్పాటు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)ను పూర్తిస్థాయిలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తామన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రకటన కార్యరూపం దాల్చలేదు. సుమారు రూ.250 కోట్లు వెచ్చించి విమ్స్‌లో రెండో దశ (ఆరు బ్లాకుల్లో కొత్త భవనాలను) నిర్మాణం చేపడతామని వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. పదికిపైగా సూపర్ స్పెషాలిటీ విభాగాలను ఏర్పాటు చేయడంతోపాటు పూర్తిస్థాయి వైద్య నిపుణులను నియమిస్తామని పేర్కొంది. అయితే, ఈ ప్రకటన చేసి రెండేళ్లు పూర్తి కావస్తున్నా ఆచరణలో ఒక్క అడుగు ముందుకుపడలేదు. సుమారు ఏడాది కిందట టెండర్లు ప్రక్రియ పూర్తయ్యింది. ఆ తరువాత ఏమైందో నిర్మాణ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. దీంతో విమ్స్ అప్‌గ్రేడేషన్ నిలిచిపోయిందని వైద్య వర్గాలు పేర్కొంటున్నాయి.

సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటుచేసిన విమ్స్‌ను అభివృద్ధి చేయడం ద్వారా ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం ఉంది. కానీ, ఆ దిశగా ప్రభుత్వం ఆలోచించడం లేదు. ప్రస్తుతం విమ్స్‌లో 30 విభాగాల్లో సేవలు అందిస్తున్నారు. వీటిలో ఆరు వరకు సూపర్ స్పెషాలిటీ విభాగాలు ఉన్నాయి. అయితే, ఇక్కడ పనిచేసే వైద్యులంతా కాంట్రాక్టు ప్రాతిపదికన పని చేస్తున్నవారే. పూర్తిస్థాయి వైద్యులు లేకపోవడంతో ఆశించిన స్థాయిలో సేవలు అందడం లేదు. ప్రభుత్వం అప్‌గ్రేడేషన్‌లో భాగంగానే పూర్తిస్థాయి వైద్య నిపుణులను నియమిస్తామని చెప్పిన మాటను ఇప్పటివరకూ నిలబెట్టుకోలేక పోయింది.

800 బెడ్స్‌కు విస్తరణ

విమ్స్‌ను 800 పడకల ఆస్పత్రిగా విస్తరిస్తామని ప్రభుత్వం, ఆరోగ్య శాఖా మంత్రి గతంలో చెప్పారు. అయితే, ఈ ప్రతిపాదన కూడా కార్యరూపం దాల్చలేదు. ఇప్పటికీ విమ్స్‌లో 450 పడకలు మాత్రమే ఉన్నాయి. పూర్తిస్థాయి వైద్యులు, సిబ్బందిని నియమించకపోవడం వల్ల రోగులకు మెరుగైన సేవలు అందడం లేదంటున్నారు. ప్రస్తుతం ఉన్న బెడ్ల సంఖ్యను, అందుకు అనుగుణంగా వైద్య సిబ్బందిని పెంచడం ద్వారా మరింతమందికి సేవలు అందించే అవకాశం ఏర్పడుతుంది.

పీజీ మెడికల్ కాలేజీ హామీ కూడా..

విమ్స్‌లో పీజీ మెడికల్ కాలేజీ ఏర్పాటుచేస్తామని గతంలో ప్రకటించారు. సుమారు మూడేళ్ల కిందట ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పెట్టారు. ఆరోగ్యశాఖ అధికారులు సమీక్షించి ఏడాదిలో ప్రక్రియ పూర్తవుతుందని విమ్స్ అధికారులకు సమాచారాన్ని పంపించారు. అన్నీ సవ్యంగా సాగితే ఈ ఏడాదిలో అడ్మిషన్లు జరగాల్సింది. కానీ, కారణమేమిటో గానీ పీజీ మెడికల్ కళాశాలకు కూడా గ్రీన్‌సిగ్నల్ రాలేదు.

జగన్‌కు చిత్తశుద్ధి ఉంటే

వైసీపీ భవనాన్ని కాపులకు కేటాయించాలి

- కూటమి నాయకులు డిమాండ్



టీడీపీ హయాంలో కాపు సంక్షేమ భవనానికి కేటాయించిన స్థలంలో నిర్మించిన వైసీపీ కార్యాలయ భవనం వద్ద కొణతాల రామకృష్ణ, పీలా గోవింద సత్యనారాయణ, ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, తదితరులు

కొత్తూరు, మార్చి 25 : అనకాపల్లి మండలం కొత్తూరు నర్సింగరావుపేట సర్వే నంబరు 75-1లో నిర్మిస్తున్న వైసీపీ జిల్లా కార్యాలయ భవనాన్ని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా అనకాపల్లి జనసేన పార్టీ అభ్యర్థి కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ స్థలంలో వైసీపీ కార్యాలయాన్ని నిర్మించడం అన్యాయమన్నారు. పేదలు ఎవరైనా సెంటు ప్రభుత్వ స్థలంలో ఇల్లు కట్టుకుంటే నిబంధనల పేరుతో కూల్చివేసే అధికారులు... ఇక్కడ ప్రభుత్వ భూమిలో దర్జాగా వైసీపీ కార్యాలయం నిర్మిస్తుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ స్థలాన్ని టీడీపీ హయాంలో కాపు సంక్షేమ భవనం నిర్మాణానికి కేటాయించారని, వైసీపీ ప్రభుత్వం కాపుల కోసం భవనం నిర్మించకుండా సొంత పార్టీకి కార్యాలయం నిర్మించుకుంటున్నదని ధ్వజమెత్తారు. సీఎం జగన్‌కు కాపుల సంక్షేమంపై చిత్తశుద్ధి ఉంటే వైసీపీ కార్యాలయం కోసం నిర్మించిన భవనాన్ని కాపులకు ఇవ్వాలన్నారు. టీడీపీ హయాంలో విద్య, ఉద్యోగాల్లో కాపులకు కల్పించిన ఐదు శాతం రిజర్వేషన్‌ను వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత జగన్‌రెడ్డి రద్దు చేశారని అన్నారు. కూటమి అధికారంలోకి రాగానే కాపులకు 5 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని, అనకాపల్లిలో కాపు సంక్షేమ భవనాన్ని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆయా పార్టీ నాయకులు ఎంనీల బాబు, కసిరెడ్డి సత్తిబాబు, సిరపపల్లి సన్యాసిరావు, శ్రీరామదాసు గోవింద రావు, తాడి రామకృష్ణ, గొంతిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (మంగళ)	6.12
సహారి (బుధ)	4.42

క్రైం... crime news

39 మద్యం బాటిళ్లతో ఒకరి అరెస్టు



దాముసాపల్లి వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

చోడవరం, మార్చి 25: మండలంలోని దాముసాపల్లి గ్రామం జంక్షన్ వద్ద అదే గ్రామానికి చెందిన చవితిన గోవింద నుంచి ఎస్ఐ శేఖరం సోమవారం మధ్యాహ్నం 39 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మద్యం బాటిళ్ల అక్రమంగా రవాణా చేస్తున్నట్టు అందుకున్న ఎస్ఐ శేఖరం తన సిబ్బందితో కలిసి గోవిందను అరెస్టు చేసి అతని నుంచి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

కృష్ణాదేవిపేటలో..

కృష్ణాదేవిపేట : బెల్టు షాపునకు తరలిస్తున్న 13 మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని, ఒకరి అరెస్టు చేశామని కృష్ణాదేవిపేట ఎస్ఐ ఎం.ఉపేంద్ర తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. కొయ్యూరు మండలం శరభన్నపాలెం గ్రామానికి చెందిన రాజేశ్ మద్యం క్వార్టర్ బాటిళ్లను శరభన్నపాలెంలో విక్రయించేందుకు తీసుకువెళుతున్నాడు. ఈ నేపథ్యంలో గొలుగొండ మండలం కొంగసింగి జంక్షన్‌లో పోలీసులు సోమవారం పట్టుకున్నారు.

10 మద్యం సీసాలు స్వాధీనం

కశింకోట, మార్చి 25: మండల కేంద్రమైన అక్రమంగా మద్యం విక్రయిస్తున్న దుకాణం(బెల్ట్ షాపు)పై పోలీసులు దాడి చేశారు. 10 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని దుకాణం నిర్వాహకుడు కర్రి సూర్య ప్రకాశ్‌ను అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెడ్ కానిస్టేబుల్ సూర్యారావు తెలిపారు.

పీటీడీ కాంప్లెక్స్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

అనకాపల్లి టౌన్, మార్చి 25: స్థానిక పీటీడీ కాంప్లెక్స్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్టు పట్టణ ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. 55 నుంచి 60 ఏళ్ల వయసు ఉంటుందని, మృతుడి వద్ద మరేఇతర ఆధారాలు లభ్యం కాలేదన్నారు. ఇతను రెండు వారాల నుంచి పీటీడీ కాంప్లెక్స్ వద్దే ఉంటున్నట్టు స్థానికులు చెబుతున్నారని, మృతుడిని ఎవరైనా గుర్తిస్తే పట్టణ పోలీస్‌స్టేషన్‌కు సమాచారమివ్వాలని ఆయన కోరారు.

కడుపునొప్పి తాళలేక బాలిక ఆత్మహత్య

చోడవరం, మార్చి 25: మండలంలోని వెంకన్నపాలెంలో సోమవారం రాత్రి ఓ బాలిక ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీనికి సంబంధించి సీఐ బి.శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. వెంకన్నపాలేనికి చెందిన సంబారు వరలక్ష్మి(17) కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. సోమవారం రాత్రి 7 గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చిచూసేసరికి ఆ బాలిక విగతజీవిగా ఉంది. మృతురాలి తల్లి గున్నమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

చెట్టు పైనుంచి జారి పడి ఒకరికి తీవ్ర గాయాలు

రావికమతం, మార్చి 25: మండలంలోని మేడివాడలో చింత చెట్టు ఎక్కిన ఓ వ్యక్తి జారి పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మేడివాడ గ్రామానికి చెందిన సోమిరెడ్డి అప్పారావు(43) సోమవారం మధ్యాహ్నం పొలంలో చింత చెట్టు ఎక్కాడు. దాని పైనుంచి జారి పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతని పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

కొత్తూరు, మార్చి 25 : అనకాపల్లి మండలం మెట్టపాలెం పంచాయతీ జగన్నాథపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి అనకాపల్లి రూరల్ ఎస్ఐ తేజేశ్వరరావు తెలిపిన వివరాలిలా వున్నాయి. మెట్టపాలెం పంచాయతీ జగన్నాథపురం గ్రామానికి చెందిన మువ్వల దేముళ్ల (48) ఆదివారం రాత్రి మద్యం అతిగా సేవించి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎన్టీఆర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కానీ అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు చెప్పారు. కాగా దేముళ్ల మృతిపై తనకు అనుమానం ఉందంటూ అతని తమ్ముడు సూర్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని రూరల్ ఎస్ఐ చెప్పారు.

పేకాట శిబిరంపై పోలీసులు దాడి

కశింకోట, మార్చి 25: మండలంలోని నర్సింగబిల్లి శివారులో పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేశామని హెడ్ కానిస్టేబుల్ సూర్యారావు తెలిపారు. నిందితుల వద్ద నుంచి రూ.2,500 నగదు స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

కూండ్రంలో మళ్లీ అగ్నిప్రమాదం.. రెండు పాకలు దగ్ధం

కొత్తూరు, మార్చి 25: మండలంలోని కూండ్రం గ్రామంలో మరోసారి అగ్నిప్రమాదం సంభవించింది. సోమవారం తెల్లవారుజామున సేనాపతి కాసుకి చెందిన రెండు పశువుల పాకలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ గ్రామంలో నెలలో ఐదుసార్లు అగ్ని ప్రమాదాలు సంభవించాయని, గుర్తు తెలియని వ్యక్తులు ఈ ఘాతుకానికి పాల్పడుతున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

ప్రధానికి ఎన్నికల కోడ్ వర్తించదా?

- ఫిర్యాదు చేసినా ఈసీఐ స్పందించదేమి?
- రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ



ఈఏఎస్ శర్మ

విశాఖపట్నం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): భారత దేశ ప్రధానికి ఎన్నికల కోడ్ వర్తించదా?, ఆయనపై అందిన ఫిర్యాదులను భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) పట్టించుకోదా?...అంటూ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ వ్యాఖ్యానించారు. ఆయన సోమవారం కొన్ని మీడియా సంస్థలతో మాట్లాడుతూ, వారం క్రితం తమిళనాడులో ప్రధాని నరేంద్రమోదీ చేసిన వ్యాఖ్యలపై తాను ఈసీకి ఈ నెల 22న ఫిర్యాదు పంపగా ఇప్పటివరకూ దానిపై ఎటువంటి స్పందన లేకపోవడం ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు రాజకీయ నాయకులు మతపరమైన అంశాలపై మాట్లాడకూడదని, అది ఉల్లంఘన కిందికే వస్తుందని శర్మ చెబుతున్నారు. 'హిందువులు నారీశక్తిని, మాతృశక్తిని బలంగా విశ్వసిస్తారని, అటువంటి శక్తిని నాశనం చేయాలని ఇండియా కూటమి పిలుపునిచ్చిందని, దానిని దేవతలను పూజించే తమిళులు ఆమోదిస్తారా?, హిందూత్వాన్ని అవమానిస్తూ ఇండియా కూటమి పదే పదే మాట్లాడుతోందని, దానిని సహిస్తామా?'...అని మోదీ ఆ సభలో ప్రసంగించినట్టు వార్తలు వచ్చాయని శర్మ తెలిపారు. ఆ ప్రసంగాన్ని పేర్కొంటూ తాను ఈసీకి ఫిర్యాదు చేశానన్నారు. ఒకవేళ ఆ మాటలు నిజమైతే మతపరమైన ప్రసంగం చేసినందుకు ప్రధానిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అయితే ఇప్పటివరకు ఎన్నికల సంఘం దానిపై స్పందించకపోవడంతో తనకు ఆశ్చర్యం, అనుమానం కలుగుతోందన్నారు. దేశాన్ని పాలిస్తున్న పొలిటికల్ ఎగ్జిక్యూటివ్ ద్వారా నియామకం పొంది, ఎన్నికల సంఘం కార్యాలయంలో తిష్ఠ వేసినందున, ఆ ఎగ్జిక్యూటివ్‌కి విశ్వాసంగా ఉండాలని ప్రయత్నిస్తున్నారా?...అని శర్మ ప్రశ్నించారు. ఎన్నికల సంఘాన్ని ఇలాగేనా నియమిస్తారు? అంటూ పోల్ బాడీని ప్రశ్నించారు. తన ప్రశ్నలకు ఎన్నికల సంఘం పబ్లిక్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

చికెన్ ధరలు



బ్యాగ్	రూ.లలో
రైతు ధర	107.00
లైవ్ ధర	127.00
విత్ స్కిన్	224.00
స్కిన్ లెస్	234.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

ఉపమాక క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

- పౌర్ణమి కావడంతో స్వామి దర్శనానికి పెద్ద సంఖ్యలో రాక
- భక్తులకు తాగునీటి సరఫరాలో అధికారులు విఫలం



ఉపమాక ఆలయం బయట భక్తుల క్యూ లైన్



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి, మార్చి 25: ఉపమాక క్షేత్రానికి సోమవారం భక్తులు పోటెత్తారు. కల్యాణోత్సవాలపాటు పౌర్ణమి కావడంతో స్వామివారిని దర్శించుకోవడానికి చుట్టుపక్కల గ్రామాలతోపాటు దూరం ప్రాంతాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. క్యూలైన్లు నిండిపోవడంతో స్వామి దర్శనానికి ఎక్కువ సమయం పట్టింది. ఎండ తీవ్రత ఎక్కువగా వుండడం, ఆలయ అధికారులు మంచినీటిని ఏర్పాటు చేయకపోవడంతో భక్తులు తీవ్ర అహనం చెందారు. బయట దుకాణాల్లో వాటర్ బాటిళ్లు కొనుక్కోవాల్సి వచ్చిందని వాపోయారు. ఈ విషయం తెలుసుకున్న ఆలయ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కొప్పిశెట్టి హరిబాబు, తోలేటి శ్రీను తదితరులు వచ్చి ఆలయ ఇన్‌స్పెక్టర్ కూర్మేశ్వరరావును నిలదీశారు. ఆలయానికి వచ్చే భక్తులకు కనీస వసతులను కల్పించడం లేదని, కనీసం తాగునీరు కూడా ఇవ్వకపోతే ఎలా? ప్రశ్నించారు. క్యూ లైన్లలో వున్న భక్తులకు వెంటనే మంచినీరు సమకూర్చుతానని కూర్మేశ్వరరావు బదులిచ్చారు. కాగా స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం మధ్యాహ్నం పూర్ణాహుతి నిర్వహించారు. రాతి మండపంలో ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు, అర్చకులు... కల్యాణ వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హోమం, పూర్ణాహుతి, చూర్ణోత్సవం నిర్వహించారు. ఉపమాక వెంకన్నను సోమవారం పాయకరావుపేట నియోజకవర్గం ఎన్నికల ఆర్‌వో కె.గీతాంజలి, ఎంజేపీ గురుకులాల జిల్లా కన్వీనర్ ఎన్.వెంకటరెడ్డి తదితర ప్రముఖులు దర్శించుకున్నారు.

రాజయ్యపేట తీరంలో శ్రీవారి చక్రస్నానం

ఉపమాక వెంకన్న కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామివారి చక్రస్నానం కన్నుల పండువగా జరిగింది. తొలుత ఉభయదేవేరులతో కూడిన కల్యాణ వేంకటేశ్వరుడిని రాజాధిరాజవాహనంపై మాఢవీధుల్లో ఊరేగించారు. అనంతరం రాజయ్యపేట సముద్రతీరానికి తోడ్కొని వెళ్లారు. సుదర్శన పెరుమాళ్ ఉత్సవమూర్తికి చక్రస్నానం చేయించారు. అనంతరం కల్యాణ వేంకటేశ్వరుడిని మధుపర్కాలు, పట్టుపీతాంబరాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.



రాజయ్యపేట తీరంలో సుదర్శన పెరుమాళ్ ఉత్సవమూర్తికి చక్రస్నానం

నరేంద్రపురంలో గ్రావెల్ దోపిడీ

- అర్ధరాత్రి ఎక్స్‌కవేటర్‌తో తవ్వకాలు, ట్రాక్టర్లతో తరలింపు
- దర్జాగా అమ్ముకుంటున్న వైసీపీ నాయకులు





నరేంద్రపురం వద్ద గ్రావెల్ తవ్విన ప్రదేశం, (ఇన్‌సెట్‌లో) మల్లవరంలో డంప్ చేసిన గ్రావెల్

అచ్యుతాపురం, మార్చి 25: మండలంలోని మల్లవరం పంచాయతీ నరేంద్రపురం వద్ద ఆదివారం రాత్రి వైసీపీ నాయకుల అండతో జోరుగా గ్రావెల్ తవ్వకాలు జరిగాయి. ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్ల శబ్దాలు విని స్థానిక యువకులు రావడంతో గ్రావెల్ తవ్వకాలు ఆపేసి అక్కడి నుంచి జారుకున్నారు. అప్పటికే సుమారు 50 ట్రాక్టర్ల గ్రావెల్‌ను తరలించారు. వివరాల్లోకి వెళితే.. నరేంద్రపురం కొండ ప్రాంతంలో ఉండడంతో ఇక్కడ గ్రావెల్ పుష్కలంగా వుంది. స్థానిక వైసీపీ నాయకులు కొంతమంది అడపాదడపా గ్రావెల్ తవ్వి, రవాణా చేస్తున్నారు. ఇదే తరహాలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత ఎక్సకవేటర్‌తో గ్రావెల్ తవ్వకాలు చేపట్టారు. గ్రావెల్ తరలించడానికి నాలుగు ట్రాక్టర్లను ఏర్పాటు చేసుకున్నారు. తెల్లవారు జామున శబ్దాలు విని నరేంద్రపురం యువకులు కొండప్రాంతానికి వెళ్లారు. వీరిని చూసి గ్రావెల్ తవ్వకం ఆపివేసి వాహనాలను అక్కడి నుంచి తీసుకుపోయారు. అప్పటికే సుమారు 50 ట్రాక్టర్ల గ్రావెల్‌ను తరలించుకుపోయారు. దీనిని మల్లవరం సాయిబాబా ఆలయం ముందు నిర్మిస్తున్న షాపింగ్ పునాదుల్లో వేశారు. ట్రాక్టర్ గ్రావెల్ వెయ్యి రూపాయల చొప్పున అమ్ముకుంటున్నారని స్థానికంగా చెప్పుకుంటున్నారు. ఇందులో రూ.600 ట్రాక్టర్ యజమానికి, రూ.200 ఎక్సకవేటర్ కిరాయికి, మిగిలిన రూ.200 వైసీపీ నాయకుల జేబుల్లోకి వెళుతున్నట్టు తెలిసింది. గ్రావెల్ అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నది వైసీపీ నాయకులు కావడంతో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు భయంతో చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పెందుర్తి టికెట్ బండారుకు కేటాయించాలి

- టీడీపీ కరపత్రాలు దహనం చేసిన కార్యకర్తలు

పరవాడ, మార్చి 25: అనకాపల్లి జిల్లా పెందుర్తి టికెట్‌ను జనసేనకు కేటాయించడంపై తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు సోమవారం నిరసన వ్యక్తంచేశారు. మండలంలోని వెన్నెలపాలెంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు సత్యనారాయణమూర్తి ఇంటి సమీపంలో టీడీపీ కరపత్రాలు దహనం చేశారు. పెందుర్తి టికెట్ విషయంలో పార్టీ అధినేత చంద్రబాబునాయుడు పునరాలోచన చేయాలని, బండారుకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఇందల కొండలరావు, పైలా రథాల సన్యాసిరావు, పైలా చినఅక్కునాయుడు, మేడిశెట్టి బాలాజీనాయుడు, రొంగలి గోపాలకృష్ణ, పైలా రామచంద్రరావు, లోకిరెడ్డి అబి సన్యాసినాయుడు, పైలా వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పట్టాలు ఇవ్వకుండానే ఇళ్ల నిర్మాణానికి యత్నం

- జగనన్న కాలనీ ఖాళీ స్థలంలో పునాదులకు గోతులు
- అడ్డుకున్న రెవెన్యూ, పోలీస్ అధికారులు

పాయకరావుపేట, మార్చి 25: ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్న పలువురు.. రెవెన్యూ అధికారులు పట్టాలు ఇవ్వకముందే ఇళ్ల నిర్మాణానికి పునాదులు తీయడం ప్రారంభించారు. సమాచారం అందుకున్న రెవెన్యూ సిబ్బంది, పోలీసులు వచ్చి అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని సీతారాంపురం, నామవరం గ్రామాలకు చెందిన పలువురు ఇళ్ల స్థలాల కోసం ఇటీవల దరఖాస్తు చేసుకున్నారు. ఎన్నికల కోడ్ కారణంగా ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియ వాయిదా పడింది. కానీ దరఖాస్తుదారుల్లో పలువురు సోమవారం రాత్రి నామవరంలోని జగనన్న కాలనీలో ఖాళీ స్థలంలో ఇళ్ల నిర్మాణానికి పునాదులు తీయడం ప్రారంభించారు. సమాచారం అందుకున్న తహసీల్దారు సూర్యనారాయణ, సీఐ పి.అప్పలరాజు, సిబ్బందితో వచ్చి గోతులు తీయడాన్ని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ, ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత సర్వే చేసి ఇళ్ల స్థలాలు కేటాయించి పట్టాలు ఇస్తామని, అప్పటి వరకు ఇక్కడ ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టవద్దని స్పష్టం చేశారు. తమ ఆదేశాలను ధిక్కరిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇదిలావుండగా ఇళ్ల స్థలాలు మంజూరు చేయిస్తామంటూ అధికార పార్టీకి చెందిన కొంతమంది స్థానిక నాయకులు డబ్బులు వసూలు చేశారని, వీరి అండతోనే ఇంటి పట్టా మంజూరు కాకుండానే ఇళ్ల నిర్మాణానికి పునాదులు తవ్వుతున్నారని తెలిసింది.

అప్పన్నకు పెళ్లి నిశ్చయం

- సంప్రదాయబద్ధంగా స్వామివారి డోలోత్సవం
- వచ్చే నెల 9న పెళ్లి రాట
- 19న వార్షిక తిరు కల్యాణం



డోలికలో స్వామిని ఊపుతున్న స్వాములు



తిరువీధిలో స్వామివారు

సింహాచలం, మార్చి 25 : వరాహ లక్ష్మీనృసింహస్వామి కల్యాణం అడివివరం గ్రామ దేవత, అప్పన్న సోదరి పైడితల్లి అమ్మవారి కుమార్తె శ్రీమహాలక్ష్మితో నిశ్చయమైంది. సోమవారం ఉదయం కొండ దిగువన అప్పన్న పెళ్లి చూపులు జరిగాయి. ఉత్సవంలో భాగంగా వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపారు. నిత్య హోమాలు, పూజలనంతరం స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని ఉభయ దేవేరులతో బుగ్గన చుక్కతో పెళ్లి కుమారుడిలా తీర్చిదిద్దారు. ఆలయ బేడా మండపంలో ముమ్మారు తిరువీధి చేసి అర్చక స్వాములు చూర్ణాలను పట్టుకుని వేద మంత్రోచ్చారణల నడుమ ప్రదక్షిణలు చేశారు. తొలుత అంతరాలయంలో మూలవిరాట్ వద్ద యోగానంద నారసింహునికి, అనంతరం బేడా మండపంలోని సింహవల్లీ తాయార్, ఆండాళ్ అమ్మవారి సన్నిధిలో, లక్ష్మీనారాయణుల సన్నిధిలో ఆళ్వారుల సన్నిధిలో చూర్ణాలతో పూజలు చేశారు. అనంతరం స్వామివారిని వేద పండితులు వెంట రాగా మంగళవాయిద్యాల నడుమ మెట్ల మార్గంలో కాలినడకన కొండదిగువకు బోయీలు మోసుకొచ్చారు. తొలిపావంచా వద్ద దేవస్థానం ఈఓ సింగల శ్రీనివాసరావు, ట్రస్టీలు, అడివివరం గ్రామానికి చెందిన భక్తులు ఘనంగా ఆహ్వానం పలికారు. అక్కడి నుంచి గ్రామస్థులు, భక్తులు, ఆలయ అధికారులు వెంట రాగా స్వామివారు పైడితల్లి అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. తనతో వివాహానికి ఆమె కుమార్తెను ఇవ్వమని కోరగా అందుకు ఆమె తొలుత తిరస్కరించి ఎట్టకేలకు సమ్మతించడంతో అమ్మవారికి పసుపు కుంకుమలు ఇచ్చి అక్కడి నుంచి పుష్కరిణి సత్రం ప్రాంగణంలోని ఉద్యానవన మండపంలో బంధుమిత్రులు, సిబ్బందితో కలిసి స్వామి ఆనందాన్ని పంచుకున్న ఘట్టాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. స్వామివారిని డోలిక (ఊయల)లో ఉంచి పూజలు చేశారు. తరువాత నాలుగు రకాల చూర్ణాలను మిళితం చేసి తొలుత స్వామివారిపై, అర్చక స్వాములపై చల్లారు. ఈ సందర్భంగా మహాభారతంలోని డోలాయమానం గోవిందం, మధ్యస్థం మాదవం అంటూ మంత్రాలను పాటగా వినిపించారు. అనంతరం కొండదిగువ మూడు మాడవీధుల్లో పల్లకిలో తిరువీధి నిర్వహించారు. తిరువీధిలో మార్గం పొడవునా భక్తులు పూలు, పండ్లతో నీరాజనాలు సమర్పించారు. కాగా వచ్చే నెల 19న స్వామి వారి వార్షిక తిరు కల్యాణ మహోత్సవం, 9న పందిరి రాట ఉత్సవం నిర్వహించనున్నట్టు ఈఓ ప్రకటించారు.

శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు విఫలం

- వైసీపీ శ్రేణుల అరాచకాలు, దౌర్జన్యాలు, హింసాకాండ పెచ్చుమీరాయి
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు ఆరోపణ
- సీఎం సొంత జిల్లాలో చేనేత కుటుంబ ఆత్మహత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్



మాట్లాడుతున్న బుద్ద నాగజగదీశ్వరరావు

తుమ్మపాల, మార్చి 25: రాష్ట్రంలో శాంతిభద్రతలను పరిరక్షించడంలో పోలీస్ యంత్రాంగం పూర్తిగా విఫలమైందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు ఆరోపించారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వైసీపీ శ్రేణుల అరాచకాలు, దౌర్జన్యాలు, హింసాకాండలు పెచ్చుమీరాయని, ఎన్నికల కోడ్ అమలు వున్నందున వీటిపై ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి సొంత జిల్లాలో రెవెన్యూ అధికారులు చేసిన అన్యాయంతో మనస్తాపం చెంది చేనేత కుటుంబం సామూహిక ఆత్మహత్యకు పాల్పడిందని, ఇందుకు వైసీపీ ప్రభుత్వం బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. చేనేత కుటుంబానికి చెందిన భూమి రికార్డులను తారుమారు చేసి వైసీపీ నేతకు అనుకూలంగా వ్యవహరించిన రెవెన్యూ అధికారులపై హత్యానేరం కింద కేసులు నమోదు చేయాలని అన్నారు. జగన్‌రెడ్డి పాలనలో బడుగు, బలహీనవర్గాలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు గింజాల లక్ష్మణరావు, గుడాల సత్యనారాయణ, బత్తుల లక్ష్మి, తిప్పాన అప్పారావు, పూడి త్రినాథరావు, శీరం వెంకటలక్ష్మి, బుద్ద భువనేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతలతో గ్రామ వలంటీర్

- ఎంపీడీవో నోటీసు జారీతో రాజీనామా



వైసీపీ నేతలతో వున్న వలంటీర్ నానాజీ (ఎర్ర గీత వున్న వ్యక్తి)

అచ్యుతాపురం, మార్చి 25: ఎలమంచిలి ఎమ్మెల్యే రమణమూర్తిరాజును కలిసేందుకు కొంతమంది కాపు నాయకులు ఆదివారం కొండకర్లలో ఎమ్మెల్యే అతిథిగృహానికి వెళ్లారు. వీరి వెంట మండలంలోని దిబ్బపాలెం పంచాయతీ క్లస్టర్-8లో వలంటీర్‌గా పనిచేస్తున్న కూనిశెట్టి నానాజీ వున్నాడు. వైసీపీ నాయకులు విడుదల చేసిన ఫొటోల్లో వలంటీర్ కనిపించడంతో జనసేన నాయకులు ఎంపీడీఓ సురేశ్ కుమార్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో పంచాయతీ కార్యదర్శి ద్వారా వలంటీర్ నానాజీకి నోటీసు ఇచ్చారు. కానీ అతను సంజాయిషీ ఇవ్వకుండా వలంటీర్ పోస్టుకు రాజీనామా చేశాడని ఎంపీడీవో తెలిపారు.

నేటి నుంచి శ్రీ సుదర్శన నారసింహ మహా యజ్ఞం

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



సిద్ధమైన యాగశాల

సింహాచలం, మార్చి 25 : సింహగిరిపై లోక కల్యాణార్థం మంగళవారం నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు జరిగే శ్రీ సుదర్శన నారసింహ మహా యజ్ఞానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. విజయవాడకు చెందిన ఆధ్యాత్మికవేత్త త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామివారి మంగళా శాసనాలతో ఆగమ శాస్త్ర విధానంలో మహా యజ్ఞం చేపట్టనున్నట్టు ఈఓ శ్రీనివాసమూర్తి తెలిపారు. ఉత్సవానికి అడివివరం గ్రామస్తులను ఆహ్వానిస్తూ సోమవారం పురవీధుల్లో వైభవంగా శోభాయాత్ర జరిపారు. యాగం కోసం ఏడు హోమ కుండాలను యాగశాల ఆవరణలోని అన్ని దిక్కుల్లోనూ సిద్ధం చేశారు. యాగం జరిగే పరిసరాలతో పాటు సింహగిరిని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. తొలిరోజు ఉదయం 10 గంటలకు ఋత్విక్ సమావేశం ఏర్పాటు చేసి, విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి ఉత్సవాంగీకారం, ఋత్వికరణం జరిపేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 5 గంటలకు గోవిందరాజస్వామిని సింహగిరి మాడవీధుల్లో తిరువీధి, మృత్సంగ్రహణము, అంకురారోపణము సంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు సన్నాహాలు పూర్తి చేశారు. కాగా యజ్ఞం పూర్తయ్యే వరకు సింహాద్రినాథుని దేవాలయంలో జరిగే అన్ని రకాల ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్టు అధికారులు ప్రకటించారు.

రైల్వే ప్రయాణికుల సమస్యలు పట్టించుకోండి

- ఉన్నతాధికారులకు లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ లేఖలు



ఉన్నతాధికారులకు పంపిన లేఖను చూపిస్తున్న భీశెట్టి బాబ్జీ

అనకాపల్లి టౌన్, మార్చి 25 : అనకాపల్లి రైల్వే ప్రయాణికుల సమస్యలను రైల్వే శాఖ అధికారులు పట్టించుకోవాలని లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే జీఎం, విజయవాడ డీఆర్‌ఎంలకు రాసిన లేఖలను విడుదల చేశారు. రోజూ అనకాపల్లి నుంచి విశాఖ వెళ్లి వచ్చే వారిలో ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు, చిల్లర వర్తకులు, సాధారణ ప్రయాణికులు సుమారు ఐదు వేల మంది ఉన్నారని, వీరికి రైలు సదుపాయం లేకపోవడంతో తీవ్రఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గుంటూరు-రాయగడ, గుంటూరు-విశాఖ సింహాద్రి, మచిలీపట్నం- విశాఖ, కాకినాడ- విశాఖ రైళ్లను తరచూ రోజుల తరబడి ఆపేస్తున్నారని, ముఖ్యంగా రెండు నెలలుగా ఈ రైళ్లు నడవకపోవడంతో అనకాపల్లి-విశాఖ మధ్య రోజూ రాకపోకలు సాగించే ప్రయాణికులు చాలా ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. విశాఖ-రాజమండ్రి రైలు ఒక్క రోజు కూడా సమయానికి రాదని పేర్కొన్నారు. సమావేశంలో కె.రమణ, కె.నరసింగరావు, ఎ.వెంకటరావు పాల్గొన్నారు.

జనసేన పార్టీలో చేరికలు


గెడ్డం బుజ్జి సమక్షంలో జనసేన పార్టీలో చేరిన గీసాల పద్మ

పాయకరావుపేట రూరల్, మార్చి25: పాయకరావుపేట పంచాయతీ మాజీ వార్డు సభ్యురాలు గీసాల పద్మ సోమవారం గుంటపల్లిలో జనసేన పార్టీలో చేరారు. జనసేన పాయకరావుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి ఆమెకు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు ఆచంట దొర, నాయకులు నారపురెడ్డి పద్మావతి, మహాలక్ష్మి, పల్లి దుర్గ, నాగుమల్లి, కర్రి బాబూరావు, పి.ప్రసాద్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఆస్పత్రిలో మందులకు నిధులివ్వాలి

» సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్

కొత్తూరు, మార్చి 25 : జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ ప్రభుత్వ ఆసుపత్రిలో మందుల కొరత తీర్చడానికి అవసరమైన బడ్జెట్‌ను వెంటనే విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు కార్పొరేట్ వైద్యం అందించడమే లక్ష్యమని వైసీపీ ప్రభుత్వం బాకా ఊదడమే తప్ప ఆచరణలో నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. రోగులకు వైద్య సేవలు మెరుగుపడేందుకు ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదన్నారు. ఆసుపత్రిలో నిధుల కొరత కారణంగా రోగులకు మందులు ఇవ్వలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ ఆసుపత్రిలో మందులు లేక కమ్యూనిటీ, ప్రాంతీయ ఆసుపత్రుల నుంచి మందులు తీసుకొచ్చి ఇస్తున్నారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థమవుతోందన్నారు. ఈ సమస్యపై జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకొని ఆసుపత్రులకు అవసమైన నిధులు మంజూరు చేయాలని లోకనాథం కోరారు.

జిల్లా కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ కార్యవర్గం

కొత్తూరు, మార్చి 25 : జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం స్థానిక వైఎంవీఏ హాలులో జరిగింది. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.కరుణ్‌కుమార్ గుప్తా, పూర్వపు అధ్యక్షుడు టి.కృష్ణమూర్తి పాల్గొని జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షునిగా వంకాయల ఈశ్వరరావు, కార్యదర్శిగా ఎన్ఎస్ ప్రకాష్‌గుప్తా, ట్రెజరర్‌గా వై.సతీష్‌కుమార్‌లను ఎన్నుకున్నారు. వీరితో రాష్ట్ర నాయకులు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మందులు వర్తకులు, పలు జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

ఏటికొప్పాక షుగర్స్‌ను మేనిఫెస్టోలో చేర్చాలి

» రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలరాజు

ఎస్.రాయవరం, మార్చి 25: ఏటికొప్పాక షుగర్ ఫ్యాక్టరీ ఆధునికీకరణపై పాదయాత్రలో ఇచ్చిన హామీని జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత నెరవేర్చకుండా రైతులకు ద్రోహం చేశారని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. అప్పలరాజు అన్నారు. సోమవారం ఫ్యాక్టరీ ఎదుట కార్మికులతో కలిసి ఆయన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని మేనిఫెస్టోలో అన్ని పార్టీల అభ్యర్థులు హామీ ఇవ్వాలన్నారు. ఇంతవరకు రైతులకు రూ.9.5 కోట్లు బకాయిలు చెల్లించకపోవడం దారుణమన్నారు. ఫ్యాక్టరీపై ఆధారపడిన ఐదు వందల కార్మికుల కుటుంబాలు, వేల మంది రైతులు, కూలీలు ఉపాధి కోల్పోయారన్నారు. ఈ కార్యక్రమలో ఫ్యాక్టరీ కార్మిక సంఘాల నాయకులు జి గోవిందరావు, కె. సత్యనారాయణ, ఎం. సత్యనారాయణ, ఎ.నారాయణమూర్తి పాల్గొన్నారు.

ఉమాధర్మలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

రాంబిల్లి, మార్చి 25 : పంచదార్ల ఉమాధర్మలింగేశ్వరస్వామి వార్షిక కల్యాణ మహోత్సవం సందర్భంగా సోమవారం భక్తులు అధిక సంఖ్యలో శ్రీవారికి పూజలు చేశారు. ఆలయ పురోహితులు పంచామృతాలతో స్వామివారికి రుద్రాభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం నిర్వాహకులు అన్నసమారాధన నిర్వహించారు. రాత్రి 12 గంటలు తరువాత శుభముహూర్తంలో స్వామి వారి కల్యాణం జరగనుందని ఆలయ పురోహితులు తెలిపారు.

తిమ్మాపురంలో చర్చిను సందర్శించిన బ్రదర్ అనిల్


బ్రదర్ అనిల్‌కుమార్‌ని సత్కరిస్తున్న జగతా శ్రీను

ఎస్.రాయవరం, మార్చి 25: మండలంలోని తిమ్మాపురంలో ఉన్న ఓ చర్చిని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల భర్త బ్రదర్ అనిల్ కుమార్ సోమవారం సందర్శించారు. ఆ చర్చి ఫాస్టర్ ఆహ్వానం మేరకు వచ్చిన బ్రదర్ అనిల్ కుమార్ అక్కడ మత ప్రార్థనలు, బోధనలు చేశారు. బ్రదర్ అనిల్ కుమార్‌ను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగతా శ్రీను సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బోణి తాతారావు, గంగరాజు పాల్గొన్నారు.

రాష్ట్రంలో కూటమిదే అధికారం

» జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ

అనకాపల్లి టౌన్, మార్చి 25: కొద్ది రోజుల్లో జరగబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో కూటమిదే అధికారమని జనసేన అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ అన్నారు. స్థానిక విజయరామరాజుపేటలో సోమవారం కాఫీ విత్ కేడర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా మరిడిమాంబ అమ్మవారిని దర్శించుకుని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీని ఓడించడమే ధ్యేయంగా కూటమి ప్రతినిధులు కృషి చేయాలని కోరారు. విశాఖను మాదక ద్రవ్యాల కేంద్రంగా మార్చిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు.యువతకు గ్రంథాలయాలు, వ్యాయామశాలలు ఏర్పాటు చేస్తామన్నారు. టీడీపీ ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు కోసమే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడిందన్నారు. ప్రతి ఒక్కరూ గాజుగ్లాసుకు ఓటేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు డాక్టర్ నారాయణరావు, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ బొడ్డేడ నాగేశ్వరరావు, స్టేట్ ఓబీసీ మోర్చా సెక్రటరీ కర్రి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


పార్టీ నేతలతో కొణతాల రామకృష్ణ , పీలా గోవింద, బుద్ద నాగజగదీశ్వరరావు

వైసీపీ నుంచి జనసేనలోకి..

కశింకోట, మార్చి 25 : మండలంలోని జమాదులపాలెం గ్రామానికి చెందిన 40 మంది యువకులు వైసీపీ నుంచి జనసేన పార్టీలోకి చేరారు. సోమవారం జనసేన అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ సమక్షంలో వీరంతా చేరారు. కొణతాల రామకృష్ణ సమక్షంలో వీరు జనసేన తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికీ జనసేన కండువాలు వేసి కొణతాల ఆహ్వానించారు. ప్రజల్లోకి గాజు గ్లాసు గుర్తు తీసుకువెళ్లి జనసేనను గెలిపించాలని యువతకు కొణతాల దిశనిర్దేశం చేశారు. కార్యక్రమంలో పలువురు గ్రామ స్థాయి నాయకులు పాల్గొన్నారు.

రానున్నది కూటమి ప్రభుత్వమే

» దార్లపూడి ఎన్నికల ప్రచారంలో వంగలపూడి అనిత

ఎస్.రాయవరం, మార్చి 25: కొద్ది రోజుల్లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వమే వస్తుందని టీడీపీ పాయకరావుపేట అభ్యర్థి వంగలపూడి అనిత అన్నారు. మండలంలోని దార్లపూడిలో సోమవారం రాత్రి అనిత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు నరకయాతన పడ్డారని, కొద్ది రోజుల్లో వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించే సమయం వచ్చిందన్నారు. రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రజలందరికి మరలా మంచి జరగబోతుందన్నారు. అంతకముందు అనిత గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులు సోమిరెడ్డి రంగనాథం, బాదనపల్లి జోగినాయుడు, పోలిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.


దార్లపూడిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న టీడీపీ అభ్యర్థి వంగలపూడి అనిత

కొణతాల విజయం కోసం ప్రచారం

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద, వార్డు ఇన్‌చార్జిలు

అనకాపల్లి టౌన్, మార్చి 25: పట్టణంలోని పాత 13వ వార్డులో జనసేన అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ గెలుపునకు మద్దతుగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. మాజీ కౌన్సిలర్లు కుప్పిలి జగన్, సిరసపల్లి ఆదిబాబు, మడగల శ్రీనివాసరావులతో కలిసి చినరాజుపేట, వడ్డీలవీధి, యర్రావారివీధి, వుప్పలవారివీధి, బొగ్గారపువారివీధుల్లో నాగజగదీశ్వరరావు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడానికి, అనకాపల్లి పట్టణం అభివృద్ధి చెందాలంటే కొణతాల రామకృష్ణకు గాజుగ్లాస్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. అలాగే గవరపాలెంలోని 80వ వార్డులో బీఎస్ఎంకే జోగినాయుడు, బొడ్డేడ మురళీ ఆధ్వర్యంలో కొణతాల గెలుపు కోసం కూటమి ప్రతినిధులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచారం చేశారు. అలాగే గౌరీ పీఏసీఎస్ మాజీ


ప్రచారంలో పాల్గొన్న నాగజగదీశ్వరరావు

చైర్మన్ కర్రి మహాలక్ష్మీనాయుడు ఆధ్వర్యంలో చినరామస్వామికోవెల, కర్రివారివీధి ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందజేసి, గాజుగ్లాస్‌కు ఓటేసి కొణతాలను గెలిపించాలని ప్రచారం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హోలీ.. ఆనందాల కేళీ

నక్కపల్లి, మార్చి 25: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం హోలీ పండుగను ఆనందంగా జరుపుకున్నారు. రాజయ్యపేట సముద్రతీరంలో పిల్లలు, యువకులు రంగులు చల్లుకున్నారు. నక్కపల్లి, వేంపాడు, ఉద్దండపురం, గొడిచెర్ల, ఉపమాక గ్రామాల్లో యువకులు హోలీని ఉత్సాహంగా జరుపుకున్నారు.

ఎలమంచిలిలో.. హోలీ వేడుకలను ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. కొత్తపేట, నాగేంద్రకాలనీ, ప్రధాన రోడ్డు వద్ద హోలీ వేడుకలు జరుపుకున్నారు. యువతీ, యువకులతోపాటు చిన్నారులు, పెద్దలు రంగులు రాసుకున్నారు.

సబ్బవరంలో.. మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో యువతీ, యువకులు హోలీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. రంగులు పూసుకొని కేరింతలు కొట్టారు. యువత డ్యాన్స్ చేస్తూ ఉత్సాహంగా గడిపారు. దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు వేడుకలు నిర్వహించారు.

రాంబిల్లిలో.. మండలంలోని పలు గ్రామాల్లో యువత సోమవారం హోలీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. చిన్న, పెద్ద తేడా లేకుండా ఒకరికొకరు రంగులు పూసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

పాయకరావుపేటలో.. హోలీ పండుగను పట్టణ ప్రజలు సోమవారం కలర్‌ఫుల్‌గా జరుపుకున్నారు. చిన్న పిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు రంగులు పూసుకుని ఉత్సాహంగా గడిపారు. యువకులు రోడ్లపై నృత్యాలు చేసుకుంటూ రంగులు చల్లుకున్నారు.

మునగపాక (తుమ్మపాల)లో..మండలంలోని తిమ్మరాజుపేటలో డావెన్సీ అంతర్జా


తిమ్మరాజుపేటలో హోలీ వేడుకులను నిర్వహిస్తున్న విద్యార్థులు

తీయ పాఠశాలలో సోమవారం హోలీ సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ కర్రి సుందరయ్య హోలీ శుభాకాంక్షలను తెలియజేశారు.

కొత్తూరులో.. స్థానిక శారదానగర్‌లో హోలీ పండుగపై విశాఖపట్నం జ్ఞానవేదిక కమిటీ సభ్యులు సోమవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు శ్రీనివాస్, అప్పారావు, రమణ మాట్లాడుతూ.. ఫాల్గుణ మాసంలో వచ్చే పౌర్ణమినాడు హోలీ పండుగ చేస్తారన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు విజయ్, అరుణ్, మంగ, లక్ష్మి, మనీమ, శ్రేయ, పద్మ, కన్యక, మల్లేష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పైడిమాంబ జాతర అనుపోత్సవం

పరవాడ, మార్చి 25 : స్థానిక పైడిమాంబ జాతర అనుపోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఏర్పాట్లు చేసింది. సోమవారం అర్ధరాత్రి ఒంటిగంట నుంచి అమ్మవారి దర్శనాలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. జాతరలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ పర్యవేక్షణలో సీఐ బాల సూర్యారావు బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఉత్సాహంగా మహిళల కోలాటం పోటీలు

స్థానిక పైడిమాంబ జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి మహిళా కోలాటం ప్రదర్శన పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీలకు 14 గ్రామాలకు చెందిన బృందాలు హాజరయ్యాయి. బంగారమ్మపురం మొదటి స్థానం, శ్రీరామపట్నం రెండవ స్థానం, మొగలిపురం మూడో స్థానం, లక్కవరం నాల్గో స్థానం, అంకుపాలెం ఐదో స్థానంలో బృందాలు నిలిచాయి. గెలుపొందిన బృందాలకు వరుసగా రూ.15వేలు, రూ. 12వేలు, రూ.10వేలు, రూ. ఆరువేలు, రూ. మూడువేలు నగదుతోపాటు జ్ఞాపికలను నిర్వాహకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ బండారు రామారావు, మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు, రెడ్డి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

» సీఐ పిన్నింటి రమణ



సబ్బవరం, మార్చి 25 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవని స్థానిక సీఐ పిన్నింటి రమణ హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఇప్పటికే ఎన్నికల నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. అన్ని పార్టీలకు చెందిన 400 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని, ఇంకా కొంతమందిపై చేయాల్సి ఉందన్నారు. లౌడు స్పీకర్లు, సభలు, సమావేశాలకు, ఎన్నికల్లో ప్రచారాలకు ఆర్వో అనుమతులు ఉండాలని సూచించారు. గ్రామ దేవతల పండగలకు కూడా ఆర్వో/ ఏఆర్వో వద్ద నుంచి గ్రామాల పెద్దలు అనుమతులు తీసుకోవాలని సూచించారు. మర్రిపాలెం టోల్‌గేట్ వద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలు ముమ్మరం చేశామన్నారు.

ఘనంగా రాములోరి విగ్రహ ప్రతిష్ఠ


పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న టీడీపీ, జనసేన శ్రేణులు

అచ్యుతాపురం, మార్చి 25: దుప్పితూరులో మహాగణపతి, లక్ష్మీదేవి, హనుమాన్, సీత, లక్ష్మణ పరివార సమేత రామచంద్రమూర్తి విగ్రహ ప్రతిష్ఠ సోమవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి విశ్వక్షేణ పూజ, మండలాలు, హోమాది క్రతువులు వేద పండితులు నిర్వహించిన అనంతరం విగ్రహ ప్రతిష్ఠ చేశారు. రాములోరిని మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, టీడీపీ ఎలమంచిలి ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ధూళి రంగనాయకులు, జనసేన ఎలమంచిలి అభ్యర్థి సుందరపు విజయకుమార్, ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు రాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, దుప్పితూరు సర్పంచ్ దేశంశెట్టి శంకరరావు, డి.ఎల్లయ్యనాయుడు, డి.వేంకటరమణ, మాడెం సూరి అప్పారావు, పల్లి శేషగిరిరావు దర్శించుకున్నారు.

దుర్గానగర్ కనకదుర్గమ్మవారి హోమం


హోమం నిర్వహిస్తున్న దృశ్యం

పాయకరావుపేట, మార్చి 25 : స్థానిక కోటలోవ దుర్గానగర్‌లో ఉన్న కనకదుర్గ ఆలయంలో సోమవారం పౌర్ణమి పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు దండెం నాగేశ్వరరావు, నరసింహ ప్రహ్లాద ఆధ్వర్యంలో ఆలయ ప్రధానార్చకులు రాచకొండ సుధాకర్ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు.

ఘనంగా అయ్యప్పస్వామి జయంతి

సబ్బవరం, మార్చి 25 : స్థానిక మూడు రోడ్ల కూడలిలో అయ్యప్పస్వామి జయంతి వేడుకలను సాయిదుర్గా పీఠం సభ్యులు సోమవారం ఘనంగా నిర్వహించారు. అయ్యప్పస్వామి చిత్రపటం వద్ద భక్తులు పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు ఏర్పాటు చేసిన ఉచిత ప్రసాద వితరణ కార్యక్రమాన్ని సీఐ పిన్నింటి రమణ, కర్రి బాబు ప్రారంభించారు.

పశువులు పాక దగ్ధం

సబ్బవరం, మార్చి 25 : మండలంలోని అంతకాపల్లిలో వనం శ్రీరామ్ పశువుల పాకకు ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని దగ్ధం అయ్యింది. స్థానికులు గమనించి పాకలో ఉన్న పశువులను బయటకు తోలడంతో పెను ప్రమాదం తప్పింది. పశువుల పాకకు ఆనుకొని ఉన్న గడ్డి వాము కూడా దగ్ధం అయ్యింది. ఈ సందర్భంగా ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రభుత్వం ఆదుకోవాలని రైతు శ్రీరామ్ కోరారు.

ఘనంగా దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం

ఎస్.రాయవరం, మార్చి 25: మండలంలోని పెదఉప్పలంలో దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు పెద్దఎత్తున అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు ఎస్ వెంకటరాజు దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వి. వీర్రాజు, గణేశ్, పిల్లి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం


6వ వార్డులో ఇంటింటి ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

పాయకరావుపేట, మార్చి 25: పట్టణంలో టీడీపీ నాయకులు సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శంఖారావం, సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాలో నాయకులు ఆరో వార్డు, పట్టుశాలీలవీధి తదితర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వి.అనితకు ఓట్లేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు జూరెడ్డి ప్రసాద్, పెదిరెడ్డి నాగవెంకటరమణ, వేములపూడి అప్పారావు, గుల్లా నాగరాజు, ఆది, సీహెచ్.పేర్రాజు తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం నియోజకవర్గం

సీఎం ఫొటోను మూసేశారు..

» ఆంధ్రజ్యోతి ఎఫెక్టు



ప్రైవేటు ఆసుపత్రి హోర్డింగ్‌పై సీఎం ఫొటోపై తెల్లకాగితం అంటించిన అధికారులు

నర్సీపట్నం అర్బన్, మార్చి 25: మండలంలోని ఓఎల్.పురం మెయిన్‌రోడ్డులో గల ప్రైవేటు ఆసుపత్రి హోర్డింగ్‌పై ఉన్న సీఎం ఫొటోను తెల్ల కాగితం అంటించి అధికారులు సోమవారం మూసేశారు. ఆస్పత్రి హోర్డింగ్‌పై సీఎం ఫొటో ఉన్నా తొలగించలేదని 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం వచ్చిన కథనానికి సంబంధిత అధికారులు వెంటనే స్పందించారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున సీఎం ఫొటో ఎలా ఉంచారని ప్రతిపక్షాలు తప్పుబట్టడంతో అధికారులు జగన్ ఫొటోపై తెల్లకాగితం అంటించారు.

పి.జగ్గంపేటలో ఎమ్మెల్యే గణేశ్ ఎన్నికల ప్రచారం



పి.జగ్గంపేటలో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే గణేశ్

నాతవరం, మార్చి 25 : నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ సోమవారం పి.జగ్గంపేటలో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఇంటింటికి వెళ్లి తనకు ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అందుకున్న మహిళలు వైసీపీకి ఓటేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, పామ్‌ఆయిల్ కార్పొరేషన్ డైరెక్టర్ పైల పోతురాజు, మండల వైస్ ఎంపీపీ-2 షైనం నాగగోపీ కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్. నరసింహరావు, గన్నవరం పీఏసీఎస్ చైర్‌పర్సన్ గొర్లి వరహాలబాబు పాల్గొన్నారు.



పాత కల్వర్టు మీద కొత్తగా పెట్టి గోడ నిర్మించిన దృశ్యం



బీటీ రోడ్డు మధ్యలో మట్టి రోడ్డు



విగ్రహాల వెనుక భాగంలో నిర్మించని రిటర్నింగ్ వాల్

అసంపూర్తిగా కొత్తవీధి బైపాస్ రోడ్డు

- » పొలాలు, చెరువు వైపు నిర్మించని రిటర్నింగ్ వాల్
- » పాత కల్వర్టుల మీద రోడ్డు నిర్మాణం
- » కల్వర్టుల నాణ్యతపై అనుమానాలు
- » మొదలు కాని డ్రైనేజీల పనులు

నర్సీపట్నం, మార్చి 25 : పట్టణంలో వేంకటేశ్వరస్వామి గుడి నుంచి పెద్ద బొడ్డేపల్లి సబ్ స్టేషన్ వరకు నిర్మించ తలపెట్టిన బైపాస్ రోడ్డు పనులు అసంపూర్తిగా ఉన్నాయి. బైపాస్ రోడ్డు నిర్మాణ పనులకు ప్రభుత్వం రూ.6 కోట్లు మంజూరు చేసింది. 30 అడుగుల వెడల్పుతో రెండున్నర కిలోమీటర్లు రోడ్డు అభివృద్ధి, వేంకటేశ్వరస్వామి గుడి నుంచి కొత్త వీధి శ్మశాన వాటిక వరకు రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీల నిర్మాణం చేయాలని ప్రతిపాదించారు. జనవరిలో పనులు మొదలు పెట్టారు. కొత్తవీధి శ్మశాన వాటిక నుంచి డాన్‌బాస్కో కళాశాల వరకు బీటీ రోడ్డు వేశారు. కళాశాల దాటిన తర్వాత కొంత భాగం మట్టి రోడ్డు ఉండి పోయింది. తర్వాత పెదబొడ్డేపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ వరకు రోడ్డు నిర్మాణం చేశారు. పంట పొలాలు వైపు, పెద్ద చెరువు వద్ద రిటర్నింగ్ వాల్స్ కట్టకుండా రోడ్డు నిర్మాణం చేయడంపై ప్రతిపక్షాల నుంచి విమర్శలు వచ్చాయి. దీని మీద గత నెల కౌన్సిల్ సమావేశంలో టీడీపీ కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు. రిటర్నింగ్ వాల్స్ లేకపోతే భారీ వర్షాలకు రోడ్డు కుంగిపోతుందని ఫిర్యాదు చేశారు. పదేళ్ల క్రితం నిర్మించిన కల్వర్టుల మీద రోడ్డు నిర్మాణం చేశారు. ట్రాఫిక్ పెరిగి వాహనాలు రాకపోకలు మొదలైతే కల్వర్టులు సామర్థ్యం సరిపోదని అంటున్నారు. పాత కల్వర్టుల నాణ్యతపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. బీటీ రోడ్డులో విద్యుత్ స్తంభాలు వేసి, వీధి దీపాలు ఏర్పాటు చేయాలి. వేంకటేశ్వరస్వామి గుడి నుంచి కొత్తవీధి శ్మశాన వాటిక వరకు డ్రైనేజీల నిర్మాణ పనులు మొదలు పెట్ట లేదు. రోడ్డు నిర్మాణం పూర్తయితే పట్టణంలో ట్రాఫిక్ సమస్య చాలా వరకు తగ్గుతుందని ప్రజలు భావించారు. పనులు సగం మేరకు జరుగుతుండడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

నర్సీపట్నంలో కేంద్ర బలగాలు కవాతు



రామారావుపేటలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు, కేంద్ర బలగాలు

నర్సీపట్నం, మార్చి 25 : ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడానికి పట్టణ ప్రజలు సహకరించాలని పోలీసులు కోరారు. సోమవారం మునిసిపాలిటీ పరిధిలోని పెదబొడ్డేపల్లి, నర్సీపట్నం, బలిఘట్టం వార్డులలో కేంద్ర బలగాలతో కలిసి పోలీసులు కవాతు నిర్వహించారు. ఆర్‌పీఎఫ్ ఎస్ఐ హరీచంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఫ్లాగ్ మార్చ్‌లో 50 మంది ఆర్‌పీఎఫ్ బలగాలు, 15 మంది పోలీసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ కాంతికుమార్ మాట్లాడుతూ.. ఎన్నికలలో ఓటర్లు నిర్భయంగా ఓటు వినియోగించుకోవాలని, ఎటువంటి గొడవలు, అల్లర్లకు తావు లేకుండా ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సుధాకరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

గౌరవ వేతనం కోసం టెక్నికల్ అసిస్టెంట్స్, డేటాఎంట్రీలు ఎదురుచూపు

నాతవరం, మార్చి 25 : మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద పనిచేసే టెక్నికల్ అసిస్టెంట్స్, డేటా ఎంట్రీలు, హెల్పర్లు నాలుగు నెలల గౌరవ వేతనం కోసం ఎదురు చూస్తున్నారు. మండలంలో మూడు ఆర్‌బీకేలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి, 8 క్లస్టర్లలో గత ఏడాది డిసెంబరు నెల నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద టెక్నికల్ అసిస్టెంట్స్, డేటాఎంట్రీలు, హెల్పర్లు మొత్తం 21 మంది పనిచేస్తున్నారు. వీరు ధాన్యం కొనుగోలు చేసేటప్పుడు ధాన్యంలో తేమశాతం, ధాన్యం నాణ్యత, గోనె సంచుల సరాఫరా తదితర విధులు నిర్వహించారు. టెక్నికల్ అసిస్టెంట్‌కు రూ.15వేలు, డేటాఎంట్రీలకు రూ.12,500, హెల్పర్లకు రూ.10వేలు గౌరవ వేతనాన్ని నిర్ణయించడం జరిగిందన్నారు. డిసెంబరు నెల నుంచి ఇప్పటివరకు నాలుగు నెలల గౌరవవేతనం తమకు ఇవ్వాలని, వెంటనే ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

గ్రామాల్లో కోతులు స్వైరవిహారం

» చిన్నారులు, వృద్ధులపై దాడులు » పంటలు నాశనం చేస్తున్న వానరాలు » పట్టించుకోని అధికారులు » రోజూ పదుల సంఖ్యలో పీహెచ్‌సీకి బాధితులు



ఏఎల్‌పురం హైస్కూల్ గోడ మీద కోతుల సంచారం

కృష్ణాదేవిపేట, మార్చి 25 : గొలుగొండ మండలంలోని పలు గ్రామాల్లో కోతులు స్వైరవిహారం చేస్తున్నాయి. రోజు పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల నుంచి రోడ్లపై వచ్చే వారంతా భయంగా రాకపోకలు సాగిస్తున్నారు. పాలకులకు, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునేవారే లేరు. ఇప్పటికే మండలంలో ఏఎల్‌పురం, సీహెచ్.నాగాపురం, చోద్యం, లింగంపేట, పాతకృష్ణాదేవిపేట, కొంగశింగి, విప్పలపాలెం, పల్లావూరు, రేకపల్లి తదితర గ్రామాల్లో విద్యార్థులు, గ్రామస్థులపై కోతులు దాడి చేసిన సంఘటనలు ఉన్నాయి. రైతులు పండించే పంటలను కోతులు నాశనం చేస్తున్నాయి. తప్పనిసరి పరిస్థితుల్లో భయపడుతూ బయటకు వస్తే చిన్నారులు, వృద్ధులు, మహిళలపై దాడి చేస్తున్నాయి. ప్రతిరోజు కృష్ణాదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కోతుల దాడిలో గాయపడిన బాధితులు పదుల సంఖ్యలో వస్తున్నారు. ఇప్పటికైనా సంబధిత అధికారులు, పాలకులు స్పందించి కోతులను పట్టి దూరంగా ఉన్న అటవీ ప్రాంతంలో విడిచిపెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చోడవరం నియోజకవర్గం

పదిహేను మద్యం బాటిళ్లతో వృద్ధుడు అరెస్టు

చోడవరం, మార్చి 25 : మండలంలోని గజపతినగరం జంక్షన్ వద్ద సోమవారం జుత్తాడ గ్రామానికి చెందిన శివాల ఆదినారాయణ అనే వృద్ధుడ్ని పదిహేను మద్యం బాటిళ్లతో పట్టుకున్నట్టు సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు. అనంతరం ఆయనను అరెస్టు చేసినట్టు చెప్పారు.

కోడి పందాలు ఆడుతున్న ఐదుగురు అరెస్టు

చోడవరం, మార్చి 25 : గవరవరం వద్ద కోడి పందాలు ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను ఆదివారం రాత్రి దాడి చేసి పట్టుకున్నట్టు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. వారి నుంచి రూ.12వేల నగదు, రెండు కోళ్లను స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్టు చేశామన్నారు. అలాగే, ముద్దుర్తి జంక్షన్ వద్ద అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న లారీని ఆదివారం రాత్రి పట్టుకుని సీజ్ చేశామని సీఐ చెప్పారు.

యోగా క్రీడాకారుడికి ఆర్థిక సాయం

చోడవరం, మార్చి 25 : జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైన ఇక్కడి పతంజలి యోగా కేంద్రం విద్యార్థి కొట్టాపు హరికిరణ్‌కు స్థానిక పెద్దలు పసుమర్తి అశోక్, మురళి, గుప్తా, భోగవిల్లి గణేష్, రెడ్డి అప్పారావులు సోమవారం ఆర్థిక సాయం అందించారు. ఈనెల 29నుంచి తమిళనాడులో జరగనున్న పోటీలకు హరికిరణ్ హాజరు కానున్నట్టు యోగా కేంద్రం డైరెక్టర్ పుల్లేటి సతీష్ తెలిపారు.

ఆర్‌ఎం రోడ్డులో తప్పిన ప్రమాదం



ప్రమాదంలో నుజ్జయిన వాహనం

బుచ్చెయ్యపేట, మార్చి 25 : మండలంలోని రాజాం-మల్లాం రోడ్డులో ఓ టిప్పర్ బీభత్సానికి స్థానికులు భయాందోళనకు గురయ్యారు. బాధితుడి కథనం ప్రకారం వివరాలివి. రాజాం శివారులో గ్రామానికి చెందిన మరిసా రాజు ఆదివారం రాత్రి మోపెడ్‌ను పక్కన పెట్టి బహిర్భూమికి వెళ్లి నిల్చున్నాడు. ఆ సమయంలో మల్లాం నుంచి రాజాం వైపు టిప్పర్ వేగంగా దూసుకు రావడాన్ని గుర్తించిన అతడు చాకచక్యంగా పక్కకు వెళ్లడంతో ప్రాణాపాయం తప్పింది. మోపెడ్ పైనుంచి టిప్పర్ దూసుకుపోవడంతో సదరు వాహనం దెబ్బతింది. కొంతమంది స్థానికులు టిప్పర్‌ను ఆపారు. ఈ ఘటనపై బుచ్చెయ్యపేట పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్టు బాధితుడు తెలిపాడు.

750 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

రావికమతం, మార్చి 25 : చీమలపాడు పంచాయతీ శివారు బొమ్మలమ్మ జోన్ వద్ద నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 750 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు కొత్తకోట ఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు సదరు ప్రాంతానికి సిబ్బందితో సోమవారం వెళ్లి దాడిచేసినట్టు చెప్పారు. నాలుగు ప్లాస్టిక్ డ్రమ్ములలో సిద్ధం చేసిన ఊటను ధ్వంసం చేయడంతో పాటు ఆయా సామగ్రినికి స్వాధీనం చేసుకున్నామన్నారు. తమ రాకను చూసి సారా తయారీ దారులు పరుగు తీసినట్టు ఎస్ఐ వివరించారు.

కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యం

» చోడవరం అసెంబ్లీ అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజు, అనకాపల్లి ఎంపీ బరిలో ఉన్న సీఎం రమేష్ విజయమే లక్ష్యమని టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల ప్రతిన



కొత్తకోట సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజు

రావికమతం, మార్చి 25 : సార్వత్రిక ఎన్నికల్లో చోడవరం నియోజకవర్గంలో టీడీపీ జెండాను ఎగురవేసి అధినేత చంద్రబాబుకు గిఫ్ట్‌గా ఇద్దామని అలాగే, అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపిద్దామని కూటమి సభ్యులు ప్రతిజ్ఞ చేశారు. కొత్తకోటలో సోమవారం సాయంత్రం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, కార్యర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజు, నియోజకవర్గ టీడీపీ, జనసేన సమన్వయకర్తలు బత్తుల తాతయ్యబాబు, పీవీఎస్ఎన్ రాజు తదితరులు మాట్లాడుతూ ఎన్నికల్లో ఉమ్మడి అభ్యరుల విజయమే అందరి లక్ష్యం కావాలన్నారు. టీడీపీ నాయకులు గూనూరు మల్లునాయుడు, కోట నీలవేణి, మూర్తి యాదవ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరామమూర్తి, నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

చోడవరం : టీడీపీ చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజు సోమవారం పట్టణంలోని పలు వార్డుల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధికి టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను ఆశీర్వదించాల్సిందిగా ఓటర్లను కోరారు. తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు, మాజీ ఎంపీపీ పెదబాబులతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం రాజు విలేకర్లతో మాట్లాడుతూ పట్టణంలో టీడీపీ నాయకులు బైలపూడి నాగరత్నం భర్త మత్య రాజు వైసీపీలో చేరినట్టు ఆ పార్టీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి వాటిని ప్రజలు నమ్మరన్నారు.

'ఐక్యంగా పనిచేసి విజయం సాధిద్దాం'



టీడీపీ మాడుగుల మండల సమావేశంలో మాట్లాడుతున్న అభ్యర్థి పైలా

మాడుగుల, మార్చి 25 : సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీని గద్దె దించడంతో పాటు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడును ఓడించడమే అందరి లక్ష్యం కావాలని మాడుగుల టీడీపీ అభ్యర్థి పైలా ప్రసాదరావు పిలుపునిచ్చారు. మాడుగులలో సోమవారం నిర్వహించిన టీడీపీ మండల స్థాయి సమావేశంలో మాట్లాడారు. పార్టీ ఆదేశాలకు అనుగుణంగా అంతా ఐక్యంగా పనిచేసి విజయం సాధించాల్సిందిగా కోరారు. నాయకులు రంజిత్‌వర్మ, అద్దెపల్లి జగ్గారావు, ఉండూరు దేముడు, పుప్పాల అప్పలరాజు, రమేష్, వడ్డే రాజ్‌కుమార్, కాళ్ల రాజు, నందారపు సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడులో...

కె.కోటపాడు : మాడుగుల నియోజకవర్గం అభివృద్ధికి తనను గెలిపించాల్సిందిగా టీడీపీ అభ్యరి పైలా ప్రసాదరావు కోరారు. కె.కోటపాడు జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం జనసేన సైనికుల పరిచయ కార్యక్రమంలో మాట్లాడారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి రాయపురెడ్డి కృష్ణ, నాయకులు బాలిబోయిన సంతోష్, సేనాపతి నాగరాజు, అన్నంరెడ్డి వెంకటలక్ష్మి, మారపురెడ్డి శివ, నంబారు రామదాసు, సూరి తదితరులు పాల్గొన్నారు.

ఇప్పటికీ తొలగించని వైసీపీ రంగులు

- » ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా పట్టించుకోని అధికారులు
- » కొమరవోలు ఎస్సీ కాలనీలో వాటర్ ట్యాంకును చూసి పలువురు ఆశ్చర్యం



కొమరవోలు ఎస్సీ కాలనీలో మంచినీళ్ల ట్యాంకుకు ఉన్న వైసీపీ రంగులు

రోలుగుంట, మార్చి 25 : ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి ఎనిమిది రోజులు గడుస్తున్నా అధికార యంత్రాంగం సరిగ్గా స్పందించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. పార్టీ రంగులు తొలగించాలని ఎన్నికల కమిషన్ ఆదేశించినా క్షేత్ర స్థాయిలో సక్రమంగా అమలు కావడం లేదు. మండలంలోని కొమరవోలు ఎస్సీ కాలనీలో ఉన్న వాటర్ ట్యాంకుకు వైసీపీ రంగులు దర్శనమిస్తున్నాయి. వీటిని స్థానికులు చూసి అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల అధికారులు స్పందించి తొలగించాలని పలువురు కోరుతున్నారు.

వడ్డాదిలో ఘనంగా ముగిసిన వెంకన్న కల్యాణోత్సవాలు

» నేత్రపర్వంగా సాగిన స్వామివారి పవళింపు సేవ » గత ఏడాది కంటే పెరిగిన హుండీ ఆదాయం





పవళింపు సేవ సందర్భంగా స్వామివారిని విశేషంగా అలంకరించిన అర్చక స్వాములు

బుచ్చెయ్యపేట, మార్చి 25 : వడ్డాది గిరిజాంబగిరిపై కొలువుదీరిన స్వయంభూ శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఇందులో భాగంగా చేపట్టిన స్వామివారి పవళింపు సేవ నేత్రపర్వంగా సాగింది. ఈ నెల 19వ తేదీన దొంగపెండ్లితో ప్రారంభమైన ఈ వేడుకలను ఆరో రోజులపాటు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సోమవారం రాత్రి పవళింపు సేవలో భాగంగా ఉయ్యాలను వివిధ రకాల పుష్పాలతో అలంకరించి, అందులో ఉత్సవ మూర్తులను అధిష్ఠించారు. అనంతరం పలువురు భక్తులు గీతాలను ఆలపించారు. ఆలయ అర్చకులు శ్రీకాంత్ ఆచార్యులు మాట్లాడుతూ పవళింపు సేవతో స్వామి వారి వార్షిక కల్యాణోత్సవాలు ముగిసినట్టు ప్రకటించారు. ఇదిలావుంటే, గత ఏడాది కంటే ఈ ఏడాది వార్షిక కల్యాణోత్సవాల్లో స్వామివారి హుండీ ఆదాయం పెరిగింది. రూ.1,32,101 రాగా, గత ఏడాది ఆదాయం రూ.8,82,656 వచ్చిందని ఈవో శర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త దొండా కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.



ఆలయ ప్రాంగణంలో హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

మాడుగుల నియోజకవర్గం

మాడుగులలో ట్రాఫిక్ సమస్య

» వారపు సంత రోజుల్లో మరిన్ని ఇబ్బందులు



సంతలో ప్రాంతంలో నిలిచిన ట్రాఫిక్

మాడుగుల, మార్చి 25 : మండల కేంద్రం మాడుగులలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు తీవ్ర రూపం దాల్చుతోంది. సోమ, గురువారాలు సంత రోజులతో పాటు సాధారణ రోజుల్లోనూ ఈ సమస్య వేధిస్తోంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదిలావుంటే, ఈ సోమవారం సంత జరుగుతున్న తరుణంలో వాహనాన్ని రోడ్డు మధ్యలో నిలిపి అన్‌లోడింగ్ చేయడంతో ఇరుపక్కలా వాహనాలు బారులుతీరి నిలిచిపోయాయి. సంత రోజుల్లో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు పోలీసులు లేకపోవడం వల్లే ఇటువంటి సమస్య తలెత్తుతున్నట్టు పలువురు వాపోతున్నారు. సంతరోజులతో పాటు సాధారణ రోజుల్లో ఉదయం పదిగంటల లోపు, మధ్యాహ్నం భోజన విరామ సమయం, సాయంత్రం వేళల్లో లోడింగ్, అన్‌లోడింగ్‌లు చేయించుకోవాలని పోలీసులు సూచిస్తున్నప్పటికీ పట్టించుకునేవారు కరువయ్యారు. ఇప్పటికైనా పోలీసులు అధికారులు ఇక్కడి సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాల్సిందిగా పట్టణవాసులు కోరుతున్నారు.

ఆనందోత్సాహాలతో హోలీ పండగ



రంగులు పూసుకుంటున్న పిల్లలు

మాడుగుల రూరల్, మార్చి 25 : హోలీ పండగను మండలంలో సోమవారం ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. పిల్లలు, యువకులు కేరింతలు కొడుతూ ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం వీధుల్లో సరదాగా తిరుగుతూ తెగ సందడి చేశారు.

గొంపలో సరుగుడు తోట దగ్ధం

రావికమతం, మార్చి 25 : గొంప రెవెన్యూ గ్రామంలో సోమవారం అర ఎకరా సరుగుడు తోట దగ్ధమైంది. కొప్పాక నారాయణమ్మకు చెందిన సరుగుడు తోట గ్రామ శివారులో ఉంది. గుర్తు తెలియని వ్యక్తులు కల్చిన సిగిరెట్టును తోటలోకి పారేయడంతో నిప్పు అంటుకుందని గ్రామస్తులు తెలిపారు. దీంతో బాధిత రైతు గగ్గోలు పెడుతున్నాడు.